క్లుప్తంగా

నేడు సీతారాముల కల్యాణం

కర్నూలు కల్చరల్: వన్‌టౌన్ మెయిన్ బజార్ ఏకాంత రామాలయంలో శనివారం ఉదయం 10.30 గంటలకు శ్రీ సీతారాముల కల్యాణం నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ దినేష్ తెలిపారు. సాయంత్రం 5.30 గంటలకు మించిన్ బజార్ రథశాల నుంచి వన్‌టౌన్ మేడం వారి సత్రం వరకు రథోత్సవం జరుగుతుందని పేర్కొన్నారు. భక్తులందరూ పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కర్నూలు(అగ్రికల్చర్): విద్యుత్ లైన్‌ల మెయిన్‌టెనెన్స్ వర్కులు జరుగుతుండటంతో ఈ నెల 27న రేడియో స్టేషన్ ఫీడర్, బాబా బృందావన్ నగర్ ఫీడర్‌లలో విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు విద్యుత్ శాఖ ఏడీఈ నాగప్రసాద్ తెలిపారు . తులసీనగర్, పద్మారైస్ మిల్, వీకర్ సెక్షన్ కాలనీ, మల్లారెడ్డి రిచ్‌మండ్ విల్లాస్, గీతాంజలీ వెంచర్, రేడియో స్టేషన్, వెంకయ్య నగర్, బాబా బృందావన్ నగర్, గోపీనగర్, నిర్మలానగర్, రాజీవ్ నగర్, టీవీఎస్ షోరూం, యమహా షోరూం ఏరియాల్లో శనివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా బంద్ చేస్తున్నట్లు అధికారులు తెలిపారు.

యువత అన్ని రంగాల్లో రాణించాలి



ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న వర్సిటీ రిజిస్ట్రార్ బాయినేని శ్రీనివాసులు

కర్నూలు కల్చరల్: యువత చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించాలని డాక్టర్ అబ్దుల్ హక్ ఉర్దూ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ బాయినేని శ్రీనివాసులు అన్నారు. కేంద్ర ప్రభుత్వం వారి విద్య, పర్యావరణ మంత్రిత్వ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 12 వ తేదీన నిర్వహించిన గ్రీన్ ఒలింపియాడ్ ఫర్ యూత్ పరీక్షల్లో ఉర్దూ వర్సిటీకి చెందిన 16 మంది విద్యార్థులు ప్రతిభ చాటారు. శుక్రవారం వర్సిటీలో నిర్వహించిన అభినందన కార్యక్రమంలో రిజిస్ట్రార్ విద్యార్థులను అభినందించి సర్టిఫికెట్లను అందజేశారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు కేవలం పాఠ్య పుస్తకాలకే పరిమితం కాకుండా పాఠ్యాంశేతర వాటిల్లో కూడా నైపుణ్యం సాధించాలని సూచించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.జహనారా, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఐక్యవేదికను బలోపేతం చేద్దాం

కర్నూలు(అర్బన్): జిల్లాలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ మహిళా ఐక్యవేదికను మరింత బలోపేతం చేద్దామని వేదిక రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షురాలు పట్నం రాజేశ్వరి, రాష్ట్ర అధ్య క్షురాలు నంది విజయలక్ష్మి పిలుపునిచ్చారు. శుక్ర వారం స్థానిక కార్యాలయంలో జరిగిన జిల్లా కార్యవర్గ సమావేశంలో వారు మాట్లాడుతూ కమిటీ సభ్యులందరూ ఐక్యంగా శ్రమించాల్సి ఉందన్నారు. ఉమ్మడి జిల్లాలోని అన్ని మండలాల్లో కమిటీ నిర్మాణాలు చేపట్టాల్సి ఉందన్నారు. ప్రస్తుత సమాజంలో మహిళల ఆత్మగౌరవం, హక్కుల కోసం నిరంతరం పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. మహిళలపై జరుగుతున్న అత్యాచారాలు,హత్యలు, దాడులకు వ్యతిరేకంగా మహిళలంతా ఏకమై పోరాటాలకు సిద్ధం కావాలన్నారు. సమావేశంలో వేదిక నాయకురాళ్లు సునీత, హుసేన్‌బీ, భాను, పెద్దక్క, ఆకుతోట పద్మావతి, దస్తగిరమ్మ, ఖాసీంబీ, లక్ష్మేశ్వరి, షేకూన్‌బీ, అమీనాబీ, ప్రభావతి, మరియమ్మ పాల్గొన్నారు.

ప్రజా ప్రభుత్వానికి పట్టం కట్టండి

- వైఎస్సార్‌సీపీ కర్నూలు అసెంబ్లీ అభ్యర్థి ఇంతియాజ్
- 49, 51 వార్డుల్లో ముమ్మరంగా ఎన్నికల ప్రచారం
- పాల్గొన్న జిల్లా అధ్యక్షురాలు సత్యనారాయణమ్మ, మాజీ ఎమ్మెల్యే ఎస్వీ, కేడీసీసీబీ చైర్‌పర్సన్ విజయమనోహరి



ఎమ్మెల్యే అభ్యర్థి ఇంతియాజ్, మాజీ ఎమ్మెల్యే ఎస్వీని కొత్తపేటలో పూలమాలతో సత్కరిస్తున్న స్థానికులు



దేవనగర్‌లో మహిళకు కరపత్రం అందజేస్తున్న పార్టీ జిల్లా అధ్యక్షురాలు సిట్రా సత్యనారాయణమ్మ



నరసింగరావుపేటలో ఇంటింటి ప్రచారం చేస్తున్న కేడీసీసీబీ చైర్‌పర్సన్ విజయమనోహరి

కర్నూలు(టౌన్): వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలోని ప్రజా ప్రభుత్వానికి పట్టం కట్టాలని వైఎస్సార్ సీపీ కర్నూలు ఎమ్మెల్యే అభ్యర్థి ఇంతియాజ్ ప్రజలకు పిలుపునిచ్చారు. శుక్రవారం నగరంలోని 49, 51 వార్డుల్లో ఇంటింటికీ ఇంతియాజ్ కార్యక్రమం పేరుతో ముమ్మరంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంతియాజ్ ఇంటింటికీ వెళ్లి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. అనంతరం ఎమ్మెల్యే అభ్యర్థి మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా ముఖ్యమంత్రి జగనన్న హయాంలో ప్రతి సంక్షేమ పథకం ఇంటి ముంగిటకే వచ్చిందన్నారు. గత ప్రభు త్వంలో జన్మభూమి కమిటీలకు లంచాలు ఇస్తేనే పనులు అయ్యేవన్నారు. ఇప్పుడా పరిస్థితి లేదన్నారు. వలంటీర్, సచివాలయ వ్యవస్థల ద్వారా పారదర్శక పాలన అందుతుందన్నారు. పైసా అవినీతికి తావు లేకుండా నేరుగా అర్హుల ఖాతాల్లో రూ.2.65 లక్షల కోట్లు జమ చేసిన ప్రభుత్వం వైఎస్సార్‌సీపీదన్నారు. మాజీ ఎమ్మెల్యే, పార్టీ కర్నూలు పార్లమెంట్ డిప్యూటీ రీజనల్ కో–ఆర్డినేటర్ ఎస్వీ మోహన్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతి ఇంటికీ మేలు చేసిన జగనన్నను మరోసారి ఆశీర్వదిద్దామన్నారు. కర్నూ లు నగరం నుంచి పార్టీ అభ్యర్థిగా నిలిచిన ఇంతియాజ్‌ను భారీమెజార్టీతో గెలిపించాలని ఓటర్లను కోరారు.

సంకల్‌బాగ్‌లో...

ఇంటింటికీ ఇంతియాజ్ కార్యక్రమంలో భాగంగా సంకల్‌బాగ్‌లో ఇంతియాజ్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పార్టీ జిల్లా అధ్యక్షులు సిట్రా సత్యనారాయణమ్మ, స్థానిక కార్పొరేటర్ కృష్ణకాంత్ రెడ్డి, సీనియర్ నాయకులు తెర్నేకల్ సురేందర్‌రెడ్డి, రాజా విష్ణువర్ధన్ రెడ్డి, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. అలాగే 49వ వార్డు పరిధిలోని నరసింగరావు పేటలో కర్నూలు అసెంబ్లీ అభ్యర్థి ఇంతియాజ్ గెలుపును కాంక్షిస్తూ కేడీసీసీ బ్యాంకు చైర్‌పర్సన్ విజయ మనోహరి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపించాలని ఓటర్లను కోరారు. కార్యక్రమంలో స్థానిక పార్టీ నాయకులు నాగవేణి రెడ్డి, అశోక్, ఆసిఫ్ పాల్గొన్నారు.

25వ వార్డు బిర్లా గడ్డలో...

25వ వార్డు పరిధిలోని బిర్లాగడ్డ వీధిలో శుక్రవారం సాయంత్రం వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు సిట్రా సత్యనారాయణమ్మ వైఎస్సార్‌సీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులకు ఓటు వేయాలని ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జగనన్న పాలనలో ప్రతి కుటుంబానికి మేలు జరిగిందన్నారు. విద్య, వైద్య రంగాలు బలోపేతమయ్యాయన్నారు. పేదల పిల్లలకు నాణ్యమైన విద్య ఉచితంగా అందుతుందన్నారు. అలాగే పేదలకు కార్పొరేట్ వైద్యం ఉచితంగా అందుతుందని చెప్పారు. ఇవన్నీ కొనసాగాలంటే ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులను గెలిపించాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు గడ్డం రామకృష్ణ, నాగరాజు, శ్రీరాములు, బోయ పెద్ద నాగరాజు, బిర్లాగడ్డ కమిటీ సభ్యులు బోయ శ్రీరాములు, దేవాలయ కమిటీ చైర్మన్, సచివాలయ కన్వీనర్లు రమేష్, వెంకటేష్, దుర్గ, సుధారాణి, ఇబ్రహీం, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

51వ వార్డు షరాఫ్ బజార్ నుంచి...

నగరంలోని 51వ వార్డు షరాఫ్ బజార్ నుంచి గౌలిగేరి ప్రాంతాల్లో ఇంటింటికీ ఇంతియాజ్ కార్యక్రమం నిర్వహించారు. కర్నూలు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఇంతియాజ్, మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ కర్నూలు పార్లమెంట్ డిప్యూటీ రీజనల్ కోఆర్డినేటర్ ఎస్వీ మోహన్‌రెడ్డి, 51వ వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి కృష్ణకాంత్ శర్మ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఇంతియాజ్ మాట్లాడుతూ ప్రతి కుటుంబానికి సంక్షేమం, అభివృద్ధి కావాలంటే ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని పిలుపునిచ్చారు. ముచ్చటగా మూడోసారి కర్నూలులో వైఎస్సార్‌సీపీ జెండా ఎగరాలని ఎస్వీ ఓటర్లకు అభ్యర్థించారు.

ముగిసిన నామినేషన్ల పరిశీలన

కర్నూలు (టౌన్): నగరపాలక సంస్థ కార్యాలయంలో శుక్రవారం కర్నూలు అసెంబ్లీ అభ్యర్థుల నామినేషన్లను పరిశీలించారు.. అభ్యర్థులు, ప్రతినిధుల సమక్షంలో రిటర్నింగ్ అధికారి భార్గవ్‌తేజ వాటిని పరిశీలించారు. కర్నూలు నియోజకవర్గం నుంచి 40 మంది అభ్యర్థులు 56 నామినేషన్లు సమర్పించారు. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల ప్రకారం లేని 13 నామినేషన్లు తిరస్కరించినట్లు రిటర్నింగ్ అధికారి వెల్లడించారు. అలాగే 27 మంది అభ్యర్థుల సభ్యత్వాన్ని ఆమోదించినట్లు చెప్పారు. ఈనెల 29 వ తేదీ వరకు నామినేషన్ల ఉపసంహరణకు గడువు ఉందన్నారు. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల తుది జాబితా అదే రోజు మధ్యాహ్నం 3 గంటల తరువాత వెలువడుతుందని చెప్పారు. నామినేషన్ల పరిశీలనలో అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి మోహన్‌కుమార్, నగరపాలక అదనపు కమిషనర్ రామలింగేశ్వర్ పాల్గొన్నారు.

పాణ్యంలో 9 నామినేషన్ల తిరస్కరణ

కర్నూలు(సెంట్రల్): పాణ్యం నియోజకవర్గంలో వివరాలు సరిగా లేని 9 నామినేషన్లను తిరస్కరించినట్లు ఆ నియోజకవర్గ ఆర్వో/జేసీ నారపురెడ్డి మౌర్య తెలిపారు. శుక్రవారం సాయంత్రం ఆమె కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..మొత్తం 23 మంది అభ్యర్థులు నామినేషన్లు వేయగా..9 మంది అభ్యర్థుల నామినేషన్లు తిరస్కరణకు గురికావడంతో బరిలో 14 మంది ఉన్నట్లు చెప్పారు. ఏదైనా కారణంతో 27, 29 తేదీల్లో నామినేషన్ల ఉపసంహరణకు అవకాశం ఉందన్నారు. మరోవైపు పోస్టల్ బ్యాలెట్ ఓటరు జాబితాను శనివారం ప్రకటిస్తామని ఆమె చెప్పారు.

36వ వార్డులో ప్రచారం

కర్నూలు(సెంట్రల్): పాణ్యం నియోజకవర్గ సీపీఎం అభ్యర్థి డి.గౌస్‌దేశాయ్ నగరంలోని 36 వార్డు పరిధిలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. తాను ఎమ్మెల్యేగా గెలిస్తే నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటానన్నారు.

జగనన్న అంటే సంక్షేమం.. బాబు అంటే కరువు

- టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి స్వగ్రామంలో ప్రచారానికి భారీ స్పందన
- సర్పంచ్‌గా అభివృద్ధి చేయలేనివాళ్లు గెలిస్తే ఎమ్మెల్యేగా ఎలా చేస్తారు?
- పసుపులలో ఎన్నికల ప్రచారంలో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి సతీష్



బహిరంగ సభలో మాట్లాడుతున్న కోడుమూరు ఎమ్మెల్యే అభ్యర్థి ఆదిమూలపు సతీష్

కర్నూలు (సిటీ): సంక్షేమ పథకాల సారథిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేరు తెచ్చుకుంటే.. చంద్రబాబు పేరు చెబితే వెన్నుపోటు, కరువు గుర్తుకు వస్తుందని వైఎస్సార్‌సీపీ కోడుమూరు ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ ఆదిమూలపు సతీష్, కుడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు కొత్తకోట ప్రకాష్ రెడ్డి, ఎం. మణిగాంధీ అన్నారు. శుక్రవారం కర్నూలు రూరల్ మండల పరిధిలోని పసుపుల పంచాయతీలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి స్వగ్రామమైన పసుపుల పంచాయతీలో వారికి ప్రజల నుంచి అపూర్వ స్పందన లభించింది. భారీ ఎత్తున డప్పు వాయిద్యాలు, టపాసులు కాల్చుతూ, బంతిపూలు చల్లుతూ ఘనంగా స్వాగతం పలికారు. అన్ని వర్గాలకు, పార్టీలకు, కులాలకు, మతాలకు అతీతంగా సంక్షేమ పథకాలను అందిస్తున్న ఏకైక రాష్ట్రం ఏపీ మాత్రమేనని అన్నారు. ఎన్నికల్లో చంద్రబాబు ఏ రోజు కూడా సొంతంగా పోటీ చేసి గెలవలేరని, జగనన్నను చూసి చంద్రబాబు వెన్నులో వణుకు పుట్టడంతోనే కూటమిగా ఏర్పడి వస్తున్నారన్నారు. గతంలో ఏ పని కావాలన్నా కర్నూలు నగరానికి వెళ్లాల్సిన పరిస్థితి ఉండేదన్నారు. ఇప్పుడు సచివాలయ, వలంటీర్ వ్యవస్థ ద్వారా గ్రామాల్లోనే పౌర సేవలను అందిస్తున్నారని తెలిపారు. బాబు వస్తే జన్మభూమి కమిటీల్లోని తెలుగు తమ్ముళ్లదే పెత్తనం అవుతుందన్నారు. వారి మాటలు నమ్మి మోసపోవద్దని సూచించారు.

ఆదాయం ఎక్కువ.. అభివృద్ధి తక్కువ

కర్నూలు నగరానికి కూతవేటు దూరంలో ఉన్న పసుపుల గ్రామ పంచాయతీలో ఆనాడు కోట్ల విజయభాస్కర్‌రెడ్డి, రాంభూపాల్ చౌదరి, వైఎస్సార్ హయాంలో జరిగిన పనులే కనిపిస్తున్నాయన్నారు. టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీలో ఉంటున్న కుటుంబ సభ్యులే గ్రామ సర్పంచ్‌గా ఉన్నా మూడేళ్లలో ఏ అభివృద్ధి చేయలేదన్నారు. అలాంటి వారు నియోజకవర్గాన్ని ఏ రకంగా అభివృద్ధి చేస్తారని ప్రశ్నించారు. పసుపుల పంచాయతీ చుట్టూ రియల్ ఎస్టేట్ వ్యాపారం ఉందని, ఆ వ్యాపారం నుంచి పంచాయతీకి వచ్చే ఆదాయం ఎక్కువగా ఉన్నా అభివృద్ధి ఎక్కడా కనిపించడం లేదన్నారు. తాగునీరు, డ్రైనేజీ కాలువలు కూడా నిర్మించలేదంటే ఆ ఆదాయం ఎక్కడికి పోతుందని ప్రశ్నించారు. వైఎస్సార్‌సీపీ పాలనలోనే గ్రామాలు అభివృద్ధి చెందాయన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు ప్రసన్నకుమార్, సింగిల్ విండో చైర్మన్లు వినయ్‌కుమార్ రెడ్డి, శేషిరెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు మహబూబ్ బాషా, వైస్ ఎంపీపీ నెహిమియా, ఎంపీటీసీ సభ్యులు కృష్ణ, రామ్‌నాథ్‌రెడ్డి, హనుమంతు, మద్దిలేటి, నాయకులు శ్రీనివాసరెడ్డి, డి.వాసు, ప్రసాద్, చిన్నలక్ష్మన్న, మోహన్ బాబు, పంచలింగాల వెంకటేశ్వరరెడ్డి, జి.శింగవరం వెంకటేశ్వరరెడ్డి, పి.రుద్రవరం వెంకటేష్, బీచుపల్లి, సంపత్‌కుమార్, సంపత్ పాల్గొన్నారు.

పేదల జీవితాల్లో వెలుగులు



మహిళను ఓటు అభ్యర్థిస్తున్న పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

- ఎన్నికల ప్రచారంలో పాణ్యం ఎమ్మెల్యే కాటసాని

కల్లూరు: రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు పేదల జీవితాల్లో వెలుగులు నింపాయని ఆ పార్టీ పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం కల్లూరు అర్బన్ 19వ వార్డులో ఆయన ఇంటింటికీ వెళ్లి ఓట్లు అభ్యర్థించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ మే 13న జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో రాష్ట్ర వ్యాప్తంగా మరోసారి ఫ్యాన్ ప్రభంజనం ఖాయమన్నారు. పేదల జీవితాలు మార్చాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నవరత్నాలు పథకాలు తీసుకువచ్చారన్నారు. 2019 నుంచి వివిధ వర్గాల ప్రజల అభ్యున్నతి కోసం కృషి చేస్తున్న వైఎస్ జగన్‌కు మద్దతుగా మే13న జరిగే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై రెండు ఓట్లు వేయాలన్నారు. ఐదేళ్లలో కర్నూలు నగరంతో పాటు కల్లూరు అర్బన్ వార్డుల్లో వివిధ అభివృద్ధి పనులు చేశామన్నారు. కల్లూరు అర్బన్ ప్రాంతం రోజు రోజుకు విస్తరిస్తుండడంతో ప్రాధాన్యతలను అనుసరించి డ్రైనేజీలు, కల్వర్టులు, రోడ్లు వేశామన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహామండలి చైర్మన్ మహేశ్వర్‌రెడ్డి, కార్పొరేటర్లు, వార్డు నాయకులు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, మహిళలు, యువకులు పాల్గొన్నారు.

నైపుణ్యాలతో క్రీడల్లో రాణింపు

కర్నూలు (టౌన్): విద్యార్థులు క్రీడా నైపుణ్యాలు ప్రదర్శించి ఉత్తమ క్రీడాకారులుగా రాణించాలని కర్నూలు సర్వజన వైద్యశాల డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ ప్రభాకర్ రెడ్డి అన్నారు. రాష్ట్ర స్థాయి స్కేటింగ్ పోటీల్లో ప్రతిభ చాటిన క్రీడాకారులకు శుక్రవారం సాయంత్రం స్థానిక స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలో అభినందించి సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి భూపతిరావు, ఉస్మానియా కళాశాల ప్రిన్సిపాల్ సమీయుద్దీన్, జిల్లా స్కేటింగ్ సంఘం అధ్యక్షుడు సుధాకర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి వ్యక్తిత్వ వికాస శిబిరం

కర్నూలు కల్చరల్: వివేకానంద కేంద్ర కన్యాకుమారి కర్నూలు శాఖ ఆధ్వర్యంలో అబ్బాస్ నగర్‌లోని రవీంద్ర విద్యానికేతన్‌లో శనివారం నుంచి వ్యక్తిత్వ వికాస శిబిరం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ప్రతి రోజు ఉదయం 8 నుంచి 11.30 గంటల వరకు శిబిరం జరుగుతుందని పేర్కొన్నారు. మేదిక్ మ్యాథమెటిక్స్, యోగ, యష్టి, నియుద్ధ భారతీయ మార్షల్ ఆర్ట్స్, దేశభక్తి పాటలు, శ్లోకాలు, కథలు, గ్రూప్ డిస్కషన్, మోటివేషన్ స్పీచెస్ తదితర అంశాల్లో శిక్షణ ఇస్తామన్నారు. వివరాలకు 93926 77581 నంబర్‌ను సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు.

అపరకర్మల భవనం ప్రారంభం

కర్నూలు కల్చరల్: ఓల్డ్‌సిటీలోని హిందూ శ్మశాన వాటికలో నూతనంగా నిర్మించిన శివాలయం, అపరకర్మల భవనాన్ని శుక్రవారం ప్రారంభించారు. కర్నూలు సద్గురుదత్త కృపాలయం వ్యవస్థాపకులు చంద్రశేఖర రెడ్డి ఆధ్వర్యంలో గౌరవాధ్యక్షులు కృష్ణ కుమారి ప్రారంభించారు, సద్గురుదత్త కృపాలయం అధ్యక్షుడు మల్లారెడ్డి, సంస్థ ఉపాధ్యక్షులు రాకేష్, నిర్మలారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి ప్రత్యేక కార్యక్రమాలు

కర్నూలు కల్చరల్: ఈనెల 28వ తేదీ నుంచి ప్రారంభిక శిక్షా వర్గ –2024ను నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర సేవిక సమితి విభాగ్ కార్యవాహిక విశాలాక్షమ్మ తెలిపారు. ఆదోని హనుమాన్ నగర్‌లోని శ్రీ నీలకంఠేశ్వర ధ్యాన మందిరంలో వారం రోజుల పాటు బాలికలు, గృహిణులకు దేశ భక్తి, చైతన్యం కలిగించి కార్యక్రమాలపై శిక్షణ ఇవ్వనున్నట్లు వెల్లడించారు.

ముంగిట్లో పశువైద్యం

- పశువుల ఆరోగ్యానికి ప్రభుత్వం ప్రాధాన్యత
- మూగవేదన లేకుండా వైద్యసేవలు
- ఉమ్మడి కర్నూలు జిల్లాలో 46,87,891 పశుసంపద
- నేడు ప్రపంచ పశువైద్య దినోత్సవం
- ఫన్ అండ్ ఫుడ్‌లో పశువైద్యులకు అవగాహన సదస్సు



గేదెకు చికిత్స చేస్తున్న పశువైద్యులు

పశువులు జ్వరమొచ్చినా... ఇతరత్రా ఏ కష్టం వచ్చినా చెప్పుకోలేవు. నోరు లేని ఈ జీవాలకు గతంలో జబ్బు చేస్తే పాడి రైతులు చాలా ఇబ్బందులు ఎదుర్కొనేవారు. ప్రస్తుతం పశువైద్య సేవలు రైతుల ముంగిటకే వస్తున్నాయి. ఒక్క ఫోన్‌కాల్‌తో పశువు ఉండే చోటుకే నిపుణులైన వైద్యులు వచ్చి వైద్యం అందిస్తున్నారు. అంతేకాకుండా ఊరూరా పశు వైద్య సహాయకుల సేవలు అందుబాటులోకి వచ్చాయి. నేడు ప్రపంచ పశు వైద్య దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం

కర్నూలు (అగ్రికల్చర్): పశు సంపదకు జిల్లా పెట్టింది పేరు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో 140 పశువైద్యశాలలు(వెటర్నరీ డిస్పెన్సరీలు), 28 ఏరియా వెటర్నరీ హాస్పిటల్స్, 175 గ్రామీణ పశువైద్యశాలలున్నాయి. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా రైతుభరోసా కేంద్రాలు ఏర్పాటు చేసింది. కర్నూలు జిల్లాలో 466, నంద్యాల జిల్లాలో 411 ఆర్‌బీకేలు ఉన్నాయి. వీటన్నింటిలోనూ పశువైద్య సేవలు అందుతుండటం విశేషం. మొత్తంగా ఉమ్మడి జిల్లాలో 1,218 గ్రామాలకు పశువైద్య సేవలు విస్తరించడం విశేషం. ఉమ్మడి కర్నూలు జిల్లాలో 46,87,891 పశుసంపద ఉంది. పశువైద్యులు ఎప్పటికప్పుడు వృత్తి నైపుణ్యాలను అభివృద్ధి చేసుకుంటేనే పశువులకు మెరుగైన వైద్య సేవలు అందించే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలోనే ప్రతిఏటా ఏప్రిల్ నెల చివరి శనివారాన్ని ప్రపంచ పశువైద్య దినోత్సవంగా నిర్వహిస్తున్నారు. 2001 నుంచి ఈ దినోత్సవాన్ని నిర్వహిస్తూ పశువైద్యులకు వృత్తినైపుణ్యాలను పెంచుతున్నారు. పశు వైద్య దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం కిసాన్ ఘాట్‌లోని ఫన్ అండ్ ఫుడ్‌లో పశువైద్యులకు అవగాహన సదస్సు నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన, జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య హాజరు కానున్నారు. ఈ సందర్భంగా పదవీ విరమణ చేసిన పశువైద్యాధికారులను సత్కరించనున్నారు.


మానవాళిని కాపాడే ఆరోగ్య కార్యకర్తలు పశువైద్యులు

పశువైద్య దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రతి ఏటా ఒక థీమ్(ప్రత్యేకత) ఇస్తుంది. దీనిపై పశుసంవర్ధకశాఖలోని వెటర్నరీ అసిస్టెంటు సర్జన్స్, అసిస్టెంటు డైరెక్టర్లకు మరింత అవగాహన కల్పిస్తారు. ఈ ఏడాది థీమ్ 'వెటర్నేరియన్స్ ఆర్ ఎసెన్సియల్ హెల్త్ వర్కర్స్' అంటే మానవులను కాపాడే ఆరోగ్య కార్యకర్తలు పశువైద్యులు. పశు పక్ష్యాదులు ఆరోగ్యంగా ఉంటే మానవాళి కూడా ఆరోగ్యంగా ఉంటుందని అర్థం.

మూగజీవుల ఆరోగ్యానికి పెరిగిన ప్రాధాన్యత

2019–20 నుంచి ఇప్పటి వరకు పశుసంపద ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోంది. ఇందులో భాగంగా నోరులేని మూగజీవుల వైఎస్ఆర్ వెటర్నరీ అంబులేటరీ క్లినిక్‌ల ద్వారా ప్రభుత్వం సత్వర వైద్య సేవలు అందిస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం పశువైద్యంలో వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టడం విశేషం. మూగజీవుల ఆరోగ్య పరిరక్షణ కోసం 108. 104 తరహాలోనే వైఎస్ఆర్ సంచార పశువైద్య సేవ రథాలను వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చింది. వీటి ద్వారా పశు సంపదకు అత్యవసర వైద్య సేవలు అందుతున్నాయి. రైతుకు వ్యవసాయం ఎంత ముఖ్యమో... పాడి కూడా అంతే ముఖ్యం. అందుకే పెద్దలు రైతు ఇంట పాడిపంట అన్నారు. ప్రభుత్వం కూడా రైతుల ఇంట పాడిని అభివృద్ధి చేసే దిశగా చర్యలు తీసుకుంటోంది. పశుపోషణ, పరిశుభ్రమైన పాల ఉత్పత్తి, దూడల మరణాలు తగ్గించడం తదితర వాటిపై రైతులకు సమగ్రంగా అవగాహన కల్పిస్తోంది. ఇందులో భాగంగా గతంలో ఎప్పుడూ లేని విధంగా పశుసంవర్ధకశాఖ ఈ ఏడాది నుంచి పశు విజ్ఞానబడి అనే వినూత్న కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది.


పశువుల ఆరోగ్య పరిరక్షణపై ప్రత్యేక దృష్టి



మూగ జీవుల ఆరోగ్య పరిరక్షణకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నాము. పశుసంపద ఆరోగ్యంగా ఉంటే మానవాళి ఆరోగ్యంగా ఉంటోంది. వైద్యం చేయ డం అంతసులువు కాదు. అవి తమ బాధను చెప్పుకోలేవు.పశువైద్యులు ఎన్నో ప్రాణాపాయ పరిస్థితుల్లో ఉన్న పశువులకు వైద్యం చేసి కాపాడుతున్నారు. ప్రతి ఏటా ప్రపంచ పశువైద్య దినోత్సవాన్ని నిర్వహిస్తూ వివిధ ప్రధాన అంశాలపై నిపుణులతో పశువైద్యులకు అవగాహన కల్పిస్తున్నాము.

– డాక్టర్ జి.శ్రీనివాస్, జాయింట్ డైరెక్టర్, పశుసంవర్ధకశాఖ, కర్నూలు

పశు వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



పశువుల నుంచి మనుషులకు అనేక వ్యాధులు సంభవిస్తున్నాయి. ఈ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి. ఎందుకంటే పశువులు ఆరోగ్యంగా ఉంటే తద్వారా మనుషులు ఆరోగ్యంగా ఉండే అవకాశం ఉంది. పశువైద్యులు క్లిష్టమైన చికిత్స ద్వారా నోరులేని మూగజీవులను ఆరోగ్యంగా ఉంచుతూ ప్రజారోగ్యానికి తోడ్పడుతున్నారు. అందువల్లనే ఈ ఏడాది థీమ్ 'వెటర్నేరియన్స్ ఆర్ ఎసెన్సియల్ హెల్త్ వర్కర్స్'. ఏదిఏమైనా పశుసంపద ఆరోగ్యంగా ఉండాలంటే క్రమం తప్పకుండా పశువులకు టీకాలు వేయించాల్సిన అవసరం ఉంది.

–డాక్టర్ రవిబాబు, సహాయ సంచాలకులు, పశువ్యాధి నిర్ధారణ కేంద్రం, కర్నూలు